



దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏసీపీ

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

- అమ్మకానికి సంబంధించిన ప్రతీ రశీదును రైతులకు ఇవ్వాలి
- ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, పురుగు మందులు, కాలం చెల్లిన విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి దుకాణ యజమానులను హెచ్చరించారు. శనివారం ఆర్మూర్‌లోని వివిధ సీడ్స్ ఫెర్టిలైజర్ దుకాణాలలో ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ గౌడ్, ఏవో హరికృష్ణ తనిఖీలు నిర్వహించారు. దుకాణాలలో స్టాక్‌రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, బిల్ బుక్, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. దుకాణాలలో ఉన్న సీడ్స్, ఫర్టిలైజర్‌ను పరిశీలించి నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన పురుగు మందులు విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. రైతులను మోసం చేయాలని చూస్తే దుకాణ యజమానులపై కఠినంగా వ్యవహరిస్తామని రైతులు అప్రమత్తంగా ఉండి వ్యవసాయాధికారులు సూచించిన విత్తనాలను కొనుగోలు చేయాలని అన్నారు. అలాగే రైతులకు విక్రయించే ప్రతీ అమ్మకానికి సంబంధించిన రశీదును రైతులకు ఇవ్వాలని సూచించారు. గ్రామాలలో నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు, ఎరువులు ఎవరైనా విక్రయిస్తే వెంటనే డయల్ 100 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు.

3 నెలల రేషన్ పంపిణీకి ఏర్పాట్లు



- ఈనెలలోనే లబ్ధిదారులకు మూడు నెలల రేషన్ పంపిణీ
- నేటి నుంచి కార్డుదారులకు మూడు నెలల సన్నబియ్యం
- కొత్త కార్డుదారులకు కూడా పంపిణీకి ఏర్పాట్లు
- ఇప్పటికే రేషన్ షాపులకు సన్నబియ్యాన్ని తరలించిన యంత్రాంగం

నిజామాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం ఈనెలలోనే మూడు నెలల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయనుంది. ఈ సన్నబియ్యం పంపిణీ ప్రక్రియ నేటి నుంచే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రేషన్ దుకాణ నిర్వాహకులు లబ్ధిదారులకు నేటి నుంచి మూడు నెలల బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే రేషన్ షాపులకు సన్నబియ్యాన్ని పంపిన అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లను చేశారు. ప్రతీ కార్డు దారుడికి జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి ఈ బియ్యాన్ని అందించనున్నారు. వర్షాలు ఇతర సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఈ ఏర్పాట్లను చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రేషన్ షాపులకు గోదాముల నుంచి బియ్యాన్ని పంపించిన అధికారులు సక్రమంగా కార్డు దారులకు అందే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు.

వర్షాకాలం ఇబ్బందుల నేపథ్యంలో..

ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో రేషన్ పంపిణీకి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జూన్, జూలై, ఆగస్టు నెలల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతుండటంతో అన్ని రాష్ట్రాల పరిధిలో పంపిణీకి సమస్యలు వస్తున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆ మూడు నెలలకు సంబంధించి బియ్యాన్ని పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆదేశాలను ఇచ్చింది. ఆ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా మూడు నెలలకు సంబంధించి సన్న బియ్యం పంపిణీకి ఏర్పాట్లను చేసింది. గత వారం రోజులుగా గోదాముల నుంచి సన్న బియ్యాన్ని రేషన్ షాపులకు తరలించింది. నేటి నుంచి జిల్లాలోని అన్ని రేషన్ షాపుల ద్వారా ఈ సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. పాత కార్డు దారులతో పాటు కొత్తగా కార్డుల్లో పేర్లు నమోదైన వారికి, కొత్త కార్డులు వచ్చిన వారికి కూడా ఈ బియ్యాన్ని అందించనున్నారు. జిల్లాలో మే నెలలో 4లక్షల 2వేల 217 కార్డుదారులకు బియ్యాన్ని అందించారు. వారి కోసం 8వేల 274 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. రేషన్ కార్డులతో పాటు కార్డుల్లో నమోదు కోసం జిల్లాలో 90వేల వరకు దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని పరిశీలిస్తున్న అధికారులు కొన్ని కొత్త వాటికి కూడా ఆమోదం తెలిపారు. కార్డుల్లో ఇప్పటివరకు పేర్లు నమోదు కాని వాటిని కూడా నమోదుచేశారు. వారికి కూడా ఈ మూడు నెలలకు సంబంధించి బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు.

జిల్లాలో 4.3 లక్షల లబ్ధిదారులు

జిల్లాలో 4లక్షల 3వేల 510 కార్డుదారులు ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వీరికి జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలకు సంబంధించి సన్నబియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. గత నెలలో ఈ కార్డులకు సంబంధించి 13 లక్షల 14 వేల 465 యూనిట్లకు బియ్యాన్ని అందించగా ప్రస్తుతం కొత్తగా చేరిన వారితో కలిపి 13 లక్షల 94వేల 503 మందికి ఈ బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు.

26వేల 217 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా

ఈనెలలో కార్డుదారులకు మూడు నెలలకు సంబంధించి రేషన్ పంపిణీ కోసం 26వేల 217 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని జిల్లాలోని రేషన్ షాపులకు పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పాత కార్డులతో పాటు కొత్తగా మంజూరైన వారికి కూడా ఈ మూడు నెలల రేషన్‌ను అందిస్తున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అర్వింద్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే అన్ని రేషన్ షాపులకు బియ్యాన్ని పంపిస్తామన్నారు. నేటి నుంచి అందించే విధంగా ఏర్పాట్లను చేస్తున్నామని ఆయన తెలిపారు. అందరికీ సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు.



పాశ్చాత్య సంస్కృతిని విడనాడాలి
- హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి
- ఘనంగా బాలాజీ మందిర 20వ వార్షికోత్సవ వేడుకలు

8

ఖరీఫ్ సాగులో నిమగ్నమైన రైతులు
- ఈసారి కూడా పసుపు సాగుపై జిల్లా రైతుల దృష్టి

7



మాట్లాడుతున్న గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి

- గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ భారతి

నవీపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ మహిళా సంఘాలను బలోపేతం చేయాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ భారతి అన్నారు. శనివారం మండల ఐకేపీ కార్యాలయంలో జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని అన్నారు. అర్హులైన మహిళలను సంఘాలలో సభ్యులుగా చేర్పించాలని ఆమె సూచించారు. మహిళలు ఆర్థిక, సామాజిక రంగాలలో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఎం శ్రీనివాస్, ఏపీఎం భూమేష్ గౌడ్, సీసీలు శ్రీనివాస్, పవన్, ప్రవీణ, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మండల మహిళా సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక

మండల మహిళా సమాఖ్య నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం సాయంత్రం ఐకేపీ కార్యాలయంలో జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో మండల అధ్యక్షురాలుగా కే.జ్యోతి(నవీపేట), కార్యదర్శి లక్ష్మి (నాగేపూర్), కోశాధికారిగా సుశీల (జన్నేపల్లి)లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులచేత ఏపీఎం భూమేష్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేయించారు.

భూభారతి రెవెన్యూ సదస్సులను
సమర్థవంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

నిజామాబాద్ అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చిన భూభారతి చట్టం కింద భూ సంబంధిత సమస్యలపై రైతులు, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు వీలుగా జూన్ 3 నుంచి అన్ని మండలాల్లో గ్రామాల వారీగా చేపట్టనున్న రెవెన్యూ సదస్సులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో శనివారం తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్‌లకు రెవెన్యూ సదస్సుల నిర్వాహణ, దరఖాస్తుల పరిశీలన క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూభారతి చట్టంలోని నిబంధనల గురించి, దరఖాస్తులను పరిష్కరించాల్సిన తీరును తెలియజేశారు. ఇప్పటికే పైలెట్ ప్రతిపాదికన జిల్లాలోని మెండోరాలో గల 8 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిగి క్షేత్రస్థాయి విచారణ జరిగిందని, అదేతరహాలో ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా అన్నిగ్రామాల్లో సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ నూతన ఆర్‌వోఆర్ చట్టంలో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తుల స్వీకరణ, వాటి పరిశీలన, విచారణ ప్రక్రియలను నిర్వహించాలన్నారు. జూన్ 3 నుంచి 20వ తేదీలోగా రెవెన్యూ సదస్సులను విజయవంతంగా పూర్తి చేయాలని ప్రతిరోజు ఉదయం 9గంటల (మిగతా 8వ పేజీలో..)



నిజాంపూర్ భారీ ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకున్న తహసీల్దార్

నిజాంపూర్‌లో ఇసుక డంప్‌ల స్వాధీనం

నవీపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిజాంపూర్‌లో శనివారం రెవెన్యూ అధికారులు భారీగా ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ వెంకట రమణ తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు స్థానికంగా ఉన్న వాగు నుంచి అక్రమంగా ఇసుకతవ్వకాలు చేపట్టి గ్రామంలో పెద్దఎత్తున ఇసుక డంప్‌లను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో సంబంధిత ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ పేర్కొన్నారు. మే 19న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన "నిజాంపూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా" అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించి అక్రమార్కులపై నిఘా పెట్టి చర్యలు చేపట్టారు. సంబంధిత ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఇందులో ఆర్ఐ నరేష్‌కుమార్ ఉన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

నిజామాబాద్‌అర్బన్, మే31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు నేటి పోటీ ప్రపంచంలో విజయం సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలను అందించడానికి తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ప్రాంతీయ కేంద్రాన్ని నగరంలోని ఐటీటవర్‌లో ఏర్పాటు చేసినట్లు ప్రాంతీయ కేంద్రాల ముఖ్యఅధికారి నవీన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ ద్వారా ఉన్నత స్థాయి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు అవసరమైన అర్థమెటిక్ మరియు లాజికల్ రిజైనింగ్‌పై శిక్షణ, కంప్యూటర్ ప్రాథమిక అంశాలైన జావా, డేటాబేస్, పైతాన్, ట్యాలీ, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్, కమ్యూనికేషన్ స్కిల్స్, అన్నిరకాల ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందిస్తామని తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని, దరఖాస్తు రుసుము రూ.599 చెల్లించి శిక్షణలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతీనెలా కొత్తబ్యాచ్ ప్రారంభమవుతుందని తెలిపారు.

సీబీఎస్‌ఈ గుర్తింపు రగడ!



నిర్మాణంలో ఓ పాఠశాల భవనం

- కరిక్యూలం, గుర్తింపు పేరుతో ప్రచారాలు
- అనుమతులు లేకున్నా అడ్మిషన్లు
- విద్యార్థుల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్న పలు విద్యాసంస్థలు

నిజామాబాద్ అర్బన్, మే31 (ఆంధ్రజ్యోతి): కాదేదీ వ్యాపారానికి అనర్హం అన్నట్లు విద్యను కూడా వ్యాపారం చేస్తున్నారు. పూర్వీకుల మాట ప్రకారం అన్ని ధానాలలోకెల్లా విద్యావిధానం గొప్పదని చెప్పిన విషయానికి నేడు ప్రస్తుత సమాజంలో చూస్తున్న విషయానికి భూమికి ఆకాశానికి ఉన్నంత మార్పు కన్పిస్తోంది. ప్రస్తుతం కార్పొరేట్ విద్య రాజ్యమేలుతున్న తరుణంలో విద్యార్థులను ఆకట్టుకునేందుకు విద్యాసంస్థలు చేయని జిమ్మిక్కులు కనిపించడం లేదు. తమకు అనుమతులు ఉన్నాయని చెబుతూ జిల్లాలోని కొన్ని ప్రైవేటు పాఠశాలలు రోజురోజుకు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నగరంలోని బైపాస్ రోడ్‌లో నిర్మిస్తున్న ఓ భవనంలో శ్రీచైతన్య సీబీఎస్‌ఈ పాఠశాల పేరుతో ఏర్పాటు చేస్తున్న పాఠశాల వివాదాస్పదం అవుతోంది. ఇంకా భవన నిర్మాణం పూర్తి కాక ముందే సీబీఎస్‌ఈ బెస్ట్ స్కూల్ పేరుతో ప్రచారం నిర్వహించి అడ్మిషన్లు తీసుకోవడంపై విద్యార్థి సంఘాలు ఆందోళన బాట పట్టాయి. ఈ మేరకు జిల్లాలోని గుర్తింపు కలిగిన సీబీఎస్‌ఈ పాఠశాలల ప్రతినిధులు సైతం విలేకరుల సమావేశం నిర్వహించడం చర్చనీయాంశమైంది. కేవలం జిల్లాలో ఏడు పాఠశాలలకు మాత్రమే సీబీఎస్‌ఈ అనుమతులు ఉన్నాయని కానీ తమకు సీబీఎస్‌ఈ అనుమతులు ఉన్నాయంటూ కొన్ని పాఠశాలలు చేస్తున్న ప్రచారాన్ని గుర్తింపు ఉన్న పాఠశాలల ప్రతినిధులు తీవ్రంగా ఖండిస్తున్నారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) అనుమతులు రావాలంటే ఢిల్లీ నుంచి ప్రతినిధులు వచ్చి తనిఖీలు నిర్వహించిన తర్వాతే అనుమతులు వస్తాయని కానీ విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేసే విధంగా కొన్ని పాఠశాలలు సీబీఎస్‌ఈ గుర్తింపు, సీబీఎస్‌ఈ కరికులం, సీబీఎస్‌ఈ అనుబంధ పేరుతో ప్రచారం నిర్వహిస్తూ అడ్మిషన్లు పొందుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. సీబీఎస్‌ఈ అనగానే నాణ్యమైన విద్యతో పాటు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు (మిగతా 8వ పేజీలో..)

నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం

- అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

జిల్లాలో సీబీఎస్‌ఈ స్కూళ్ల పేరుతో కొత్తగా ఏర్పాటవుతున్న పాఠశాలలు ఖచ్చితంగా విద్యాశాఖ అనుమతి తీసుకోవాలి. ప్రాథమిక పాఠశాల స్థాయిలో ఖచ్చితంగా విద్యాశాఖ అనుమతులు తీసుకున్న తర్వాతే సీబీఎస్‌ఈ బోర్డు అనుమతి ఉంటుంది. ఇటీవల నగరంలో నిబంధ నలకు విరుద్ధంగా ఇంకా నిర్మాణం పూర్తికాని పాఠశాల విషయంలో విద్యార్థి సంఘాలు ఫిర్యాదులు చేస్తున్నాయి. క్షేత్రస్థాయి పరిశీలన చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

డిగ్రీ పరీక్షల్లో ఒకరు డిబార్

డిచ్‌పల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ శనివారం జరిగిన డిగ్రీ రెగ్యూలర్, బ్యాక్‌లగ్ పరీక్షల్లో ఒకరు డిబార్ అయినట్లు ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. డిగ్రీ సీబీసీఎస్ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, 1, 3, 5వ సెమిస్టర్ బ్యాక్‌లగ్ 2020-2024లో జరిగిన బ్యాక్‌లగ్ పరీక్షలు 14వ రోజు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 32 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం జరిగిన సెమిస్టర్ పరీక్షలకు 5,627 విద్యార్థులకు గాను 5,225 హాజర కాగా, 401మంది గైర్హాజరని, మధ్యాహ్నం జరిగిన సెమిస్టర్ పరీక్షలకు 2,213 మంది విద్యార్థులకు గాను 2008 మంది హాజరయ్యరని, 205 గైర్హాజరయ్యారని చంద్రశేఖర్ తెలిపారు. సీఎస్ఐ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థి డిబార్ అయినట్లు ఆడిట్‌సెల్‌డైరెక్టర్ పేర్కొన్నారు.

ఏడో బెటాలియన్ కమాండెంట్‌గా
సత్యనారాయణకు పూర్తి బాధ్యతలు



గత కొంతకాలంగా అదనపు కమాండెంట్‌గా ఉన్న బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ సత్యనారాయణకు కమాండెంట్ గా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. దీంతో ఆయన డిచ్‌పల్లి 7వ పోలీస్‌బెటాలియన్ కమాండెంట్‌గా పూర్తి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పోలీసు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

పంటలకు మద్దతు ధర పెంపుపై హర్షం

కోటగిరి,మే31(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పంటలకు మద్దతు ధర పెంచడం పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పోతంగల్ మండల కేంద్రంలో శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 14రకాల పంటలకు మద్దతు ధర పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు. రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగం సాయిలు, మక్కయ్య, కిరణ్, అశోక్, శంకర్, విజయ్, దిగంబర్ తదితరులు పాల్గొన్నారు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

రెంజల్,మే31(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడ్ బిలోలి, మొగులాలి తండా, రెంజల్, బోర్గాం గ్రామాలకు చెందిన లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మండల పార్టీ అధ్యక్షులు మొబిన్ ఖాన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సీహెచ్ రాములు, సాయిరెడ్డి, నాయకులు ధనుంజయ్, శ్రీనివాస్, రామాలయ కమిటీ చైర్మన్ గొసుల శ్రీనివాస్, గంగాధర్, ఖుద్దుస్, బాబునాయక్, శంకర్, నర్సయ్య, అశోక్, సామెల్, సీహెచ్ లక్ష్మణ్, రవీందర్ గౌడ్, నర్సయ్య, పోశెట్టి, గంగాధర్, హైమద్, సంతోష్, అమ్జద్, అంజాగౌడ్, యోగేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బడి బస్సు భద్రమేనా !?

- రోడ్లపై కాలం చెల్లిన బస్సులు
- ఫిట్‌గా లేకున్నా ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ జారీ
- ఆర్టీఏ కార్యాలయం రాకున్నా అనుమతులు
- మామూళ్ల మత్తులో అధికారులు


ఫిట్‌నెస్ కోసం వచ్చిన బస్సులు

బోధన్‌రూరల్,మే31(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. నెల రోజులుగా షెడ్‌లో ఉన్న ప్రైవేటు పాఠశాలల బస్సులు రోడ్డెక్కేందుకు సిద్ధమవుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో ప్రైవేటు పాఠశాలలకు చెందిన 500బస్సులు ఉన్నాయి. బోధన్ డివిజన్‌లో సుమారు 60బస్సులు ఉన్నాయి. వీటి ఫిట్‌నెస్ గడువు ఈ నెల 15తో ముగిసింది. ఈ వార్షిక సంవత్సరం రోడ్డెక్కాలంటే ఆర్టీఏ కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫికేట్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు తీసుకోనున్న ఫిట్‌నెస్ సర్టిఫికేట్ 2025 మే 15వరకు ఉంటుంది. ప్రతి బస్సు ఆర్టీఏ కార్యాలయానికి తీసుకురావాల్సి ఉంటుంది. ఆర్టీఏ అధిఆరులు బస్సుల ఫిట్‌నెస్ పరిశీలించి సర్టిఫికేట్స్ జారీ చేయడం నిబంధన. మరో పదిహేను రోజుల్లో రోడ్డెక్కనున్న ప్రతి బస్సుకు ఫిట్‌నెస్ జారీ చేసి ఉంటుంది. బస్సులు ఎంత ఫిట్‌గా ఉన్నాయో తెలియదు కాని సర్టిఫికెట్స్ జారీ పేరిట అధికారులు భారీగానే ముడుపులు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల ధన దాహంతో కాలం చెల్లిన బస్సులు రోడ్డెక్కుతూ ప్రమాదాలకు గురవుతున్నాయనే విమర్శలున్నాయి.

● నిబంధనలు పాటించాలి..

పాఠశాలల బస్సుల్లో ఆర్టీఏ నిబంధనల మేరకు పలు సౌకర్యాలు కల్పించాలి. బస్సు నడిపే డ్రైవర్ 50యేళ్ల వయస్సు దాటరాదు. ప్రమాదాలు జరిగినప్పుడు తప్పించుకునేందుకు ఎమర్జెన్సీ డోర్ ఉండాలి. బస్సులో ప్రయాణించే పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స అందించేందుకు మెడికల్ కిట్ ఉండాలి. ఫైర్ సెఫ్టీ కిట్, హ్యాండ్ బ్రేక్, డ్రైవర్ డీటెయిల్స్ తప్పనిసరిగా బస్సులో ఉండాలి. బస్సు 15యేళ్ల సర్వీసు కలిగిఉండాలి. 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వాహనానికి మరొక సంవత్సరం రోడ్లపైన తిరిగే అవకాశం కల్పిస్తారు. అదనంగా ఇచ్చే ఒక సంవత్సరం సైతం ఆర్టీఏ అధికారులు ధ్రువీకరిస్తేనే రోడ్డెక్కాల్సి ఉంటుంది. 16యేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వాహనాలు రోడ్డెక్కే అవకాశం ఉండదు. ఆ వాహనాన్ని స్క్రాబ్‌కు విక్రయించాల్సి ఉంటుంది.ప్రతి స్కూల్ బస్సు 30కిలో మీటర్ల పరిధిలో మాత్రమే తిరుగాల్సి ఉంటుంది. దీనికి ప్రతి ఐదేళ్లకోసారి 3400రూపాయలు చెల్లించి పర్మిట్ తీసుకోవాల్సి ఉంది. ఈ నిబంధనలు పాటించే స్కూల్ బస్సులు మాత్రమే రోడ్లపైన తిరగాలి.

● ఫిట్ లేకున్నా సర్టిఫికేట్

ఫిట్‌గా లేకున్నా ఫిట్‌నెస్ సర్టిఫికేట్స్ ఇస్తున్నారనే అపవాదు ఆర్టీఏ అధికారులపై ఉంది. నగరంలో పలు కార్పొరేట్ పాఠశాలలకు పదుల సంఖ్యలో బస్సులు ఉన్నాయి. డ్రైవర్స్‌ను పెట్టుకుని నడిపిస్తుంటారు. కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలలో పలుకుబడి ఉన్న వ్యక్తులే ఎక్కువగా ఉన్నారు. కార్పొరేట్ పాఠశాలల బస్సులు ఆర్టీఏ కార్యాలయం రాకుండానే ఫిట్‌నెస్ సర్టిఫికేట్స్ జారీ అవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

బస్సు పరిశీలించాకే సర్టిఫికెట్లు



బస్సును పరిశీలించాలకే ఫిట్‌నెస్ సర్టిఫికేట్ జారీ చేస్తున్నాము. కార్యాలయానికి రాని బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్స్ ఇచ్చే ప్రసక్తే లేదు. యేడాదిగా నగరంలో పాఠశాలల బస్సులు ప్రమాదాల బారిన పడిన దాఖలాలు లేవు. శాఖ అధికారులు ఎవరు అవకతవకలకు పాల్పడినా చర్యలు తీసుకుంటాం. బస్సు డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహి స్తాం. శాఖ నిబంధనలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై శాఖపరంగా అవగాహన కలిగిస్తాం. జూన్ మొదటి వారంలో డ్రైవర్లకు శిక్షణ తరగతులు ఉంటాయి.

- ఎంవీఐ శ్రీనివాస్, బోధన్

ఈరవత్రి అనిల్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు


అనిల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

భీమ్‌గల్ రూరల్ , మే31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీలో సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా శనివారం మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాద్‌లోని అనిల్‌ను ఆయన చాంబర్ లో కలిసి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనిల్‌ను కలిసిన వారిలో రాగుల మోహన్, రగుల లింబాద్రి, కుమ్మరి శంకర్, ముల్గురి గణేష్, సతీష్‌మల్లేష్ ఉన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

ఆర్మూర్‌టౌన్ ,మే31(ఆంధ్రజ్యోతి):మండలంలోని చేపూర్ శివారులో భీమ్‌గల్ మండలం ముచ్కూర్ గ్రామానికి చెందిన కురుకుల మురళి(63) అనారోగ్యంతో మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. చేపూర్ శివారులోని క్షత్రియ కాలేజీ పక్కనగల వీరబ్రహ్మేంద్రస్వామి గుడికి శుక్రవారం ఇంటినుంచి బయల్దేరిన మురళి మార్గమధ్యంలో మరణించాడని తమ్ముడు విష్ణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బడాభీమ్‌గల్‌లో రెండిళ్లల్లో చోరీ

భీమ్‌గల్‌రూరల్, మే31(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు తాళం వేసిన రెండు ఇండ్లలో చోరీకి పాల్పడ్డారు. కాళ్లగడ్డ నర్సు ఇంటితాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ. 20వేలు ఎత్తుకెళ్లారు. అలాగే గున్నాల ఉమ ఇంట్లో బీరువా పగులగొట్టి రూ. 10వేలు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

బోధన్‌రూరల్,మే31(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణం రాకాసిపేట్‌కు చెందిన కడమల ప్రభాకర్(55)అనే వ్యక్తి ఎమ్మార్వో ఆఫీస్‌కు వెళ్లి వస్తానని చెప్పి శుక్రవారం వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. అతని కుటుంబ సభ్యులు అతని ఆచూకీ గురించి బంధువుల వద్ద వెతికిన ఎలాంటి ఆచూకీ లభించలేదన్నారు. అతని కుమారుడు భాను భూషణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సీసీ ఫుటేజీ ద్వారా అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

అక్రమంగా పశువుల రవాణా చేయొద్దు

● పోలీస్ కమిషనర్ సాయి చైతన్య


సాటాపూర్‌లో పశువుల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

రెంజల్,మే31(ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా రవాణా చేపట్టరాదని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. శనివారం మండలంలోని సాటాపూర్ మార్కెట్‌తో పాటు బోర్గాం గ్రామ సరిహద్దులో ఉన్నట్టువంటి పశువుల కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. పశువుల కొనుగోలుకు సంబంధించిన రికార్డులను పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అడిగి తెలుసుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా పశువుల అక్రమ రవాణాకు సంబంధించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. మహరాష్ట్ర సరిహద్దుకు దగ్గరులో సాటాపూర్ మార్కెట్ ఉందని ఈ మార్కెట్ ద్వారా మహరాష్ట్ర, తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను పరిశీలించాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆవుల అక్రమ రవాణా జరుపకూడదన్నారు. పశువుల రవాణాకు పంచాయతీ పర్మిషన్ తప్పనిసరి అన్నారు. సంబంధిత అధికారులు పశువుల కొనుగోలు విషయంలో చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, జిల్లా పశువైద్య అధికారి రోహిత్ రెడ్డి, ఎస్ఐ చంద్రమోహన్, పశువైద్య అధికారి డాక్టర్ విఠల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీ తదితరులున్నారు.

పలుచోట్ల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ


ఆలూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో

ఆలూర్, మే31(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎంపీడీవో గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. ఇండ్లు మంజూరు చేయించిన సీఎం రేవంత్‌రెడ్డికి, ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వినయ్‌రెడ్డికి లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మల్లారెడ్డి, ఇందిరమ్మ కమిటి సభ్యుడు ఆమందు సంజీవ్, భాస్కర్, చిరంజీవి, నారాయణ, నవనీత్, గంగారెడ్డి, కార్యదర్శి రాజలింగం పాల్గొన్నారు.

ఆలూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలప అపోహలు వద్దని లబ్ధిదారులు వాటిని నమ్మొద్దని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్ కోరారు. ఇటీవల కొందరు ఇందిరమ్మ ఇళ్లపై ఇష్టం వచ్చి న తీరుగా మాట్లాడుతున్నారని వారి చేసేతప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలను కోరారు. ఇందిరమ్మ ఇళ్లు పూర్తిస్థాయిలో 9 పిల్లర్లతో డబుల్ బెడ్ రూం, హాల్, కిచెన్ సౌకర్యాలతో ప్రభుత్వం నిర్మిస్తుందని ఆయన అన్నారు.

బోధన్‌రూరల్: అర్హులైన లబ్దిదారులు ఇందిరమ్మ ఇళ్లను సద్వినియోగం చేసుకోవాలని బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్ అన్నారు. శనివారం మండలంలోని పాత సాలంపాడ్ తదితర గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్దిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సొంతింటి కలను నెరవేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మందర్నా రవి, పాత సాలంపాడ్ గ్రామ పెద్దలు బసవేశ్వర్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లె రమేష్, ఖాజాపూర్ అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డిలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: పేద వాడి సొంతింటి కల సహకారం అయ్యేందుకు ప్రభుత్వం పేద వారిని గుర్తించి పక్కా నివాస గృహలను నిర్మించాలన్న ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను అందించడం జరిగిందని ఎంపీడీవో వెంకటేష్, పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్‌లు అన్నారు. శనివారం మండలంలోని బోర్గాం, తాడ్‌బిలోలి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు ఇంటి పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సోసైటీ చైర్మన్ మొయినోద్దీన్, పార్టీ మాజీ మండల అధ్యక్షులు రాములు, సాయిరెడ్డి, ధనుంజయ్, యూత్ కాంగ్రెస్ బోధన్ అసెంబ్లీ అధ్యక్షుడు కార్తీక్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిద్దపోశెట్టి,నాయకులు తదితరులున్నారు.

డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్దిదారులు వేగవంతం చేసుకోవాలని నిర్మించుకున్న ప్రతి ఒకరికి ప్రభుత్వ ఆర్థిక సహాయం దశల వారిగా అందించడం జరుగుతుందని డీసీసీ డెలిగెట్ ధర్మగౌడ్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని మెంట్రాజ్‌పల్లిలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లనిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరేందర్‌రెడ్డి, కార్యకర్తలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

పొగాకుతో అనారోగ్య సమస్యలు


రుద్రూరులో పొగాకుపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్‌అయేషా సిద్దిక

రుద్రూరు,మే31(ఆంధ్రజ్యోతి): పొగాకుతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని మండల వైద్యాధికారి డాక్టర్ అయేషా సిద్దిక పేర్కొన్నారు. రుద్రూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు పీల్చడం, క్యాన్సర్‌తో పాటు పలు రకాల వ్యాధులు వ్యాపించి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. పొగాకు నుండి బయట పడేందుకు పలు చిట్కాలను వివరించారు. అనంతరం సిబ్బందితో పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నిషియన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి


సారంగపూర్‌ఆలయంలో పూజలు చేస్తున్న జడ్జి దంపతులు

నిజామాబాద్ కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రసిద్ధి చెందిన పలు ఆలయాలను హైకోర్టు న్యాయమూర్తి సృజన దర్శించుకున్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నీలకంఠేశ్వర ఆలయం, సారంగపూర్ హనుమాన్ దేవాల యం, సుభాష్‌నగర్ రామాల యం లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో జరిగిన విశేష పూజలో హైకోర్టు న్యాయమూర్తి కుటుంబ సభ్యులు పాల్గొని గోత్ర నామాలతో పూజించారు. కంఠేశ్వర్ దేవాలయంలో జరిగిన పూజాది కార్యక్ర మంలో అర్చకులు సుహాల్ షాకాయ్, నీలేష్, మకరంద్, శేఖర్‌లు న్యాయ మూర్తి దంపతులకు ప్రసాదం అందజేయగా సారంగపూర్ హను మాన్ దేవాలయంలో అర్చకులు శశికుమార్, రాందాసి తీర్థప్రసాదాలు అందజేశారు. సుభాస్‌నగర్ రామాలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో ఆలయ అర్చకులు కందాళై రాఘవాచార్య, ఆలయ కమిటీ చైర్మన్ సరళ మహేందర్ రెడ్డి శేషవస్త్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సారంగపూర్ ఆలయ కార్యనిర్వాహణ అధికారి వేణు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నవీపేట,మే31(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ మండలం జలాల్‌పూర్‌కు చెందిన కొండ్రపల్లి శ్రీనివాస్ (36) అదృశ్యమయ్యాడని ఏఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు. ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లడానికి ఈ నెల 27న హైదరాబాద్‌లో మెడికల్ టెస్ట్ చేయించుకోవడానికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు. అతని ఆచూకీ గురించి ఎంత వెతికినా లభించకపోవడంతో భార్య రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

బైక్ చోరీ

నవీపేట,మే31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి పిల్లి కిషన్‌కు చెందిన బైక్ చోరీకి గురైందని ఏఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ నెల 26న తన ఇంటి బయట హీరో స్పెండర్ బైక్‌ను పార్క్ చేసి ఉంచగా గుర్తుతెలియని దొంగలు అపహరించారని ఏఎస్ఐ పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ భవన కార్మికుడి మృతి

భీమ్‌గల్ రూరల్ , మే31(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుదర్శన్ నగర్ తండాలో శుక్రవారం భూక్య గంగాధర్‌కు చెందిన నూతన ఇంటి నిర్మాణం చేస్తుండగా భూక్యదేవ్ (50) అనే కార్మికుడు ఫిట్స్ వచ్చి కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యుల సూచనల మేరకు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మృతిడి స్వస్థలం మండలంలోని సికింద్రాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దమ్మకాడి తండా. ప్రకాష్ అనే మేస్త్రీవద్ద వచ్చాడన్నారు. కుటుంబ సభ్యుల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మందకృష్ణను సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆర్మూర్‌టౌన్, మే31 (ఆంధ్రజ్యోతి):ఇటీవల పద్మశ్రీ అవార్డును అందుకున్న మందక్రిష్ణ మాదిగను ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి పట్టు శాలువ, పూలమాలతో సన్మానించారు. శనివారం వరంగల్‌లోని కాళోజీ కళక్షేత్రంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమాన్ని ఆర్మూర్ ఎంఆర్‌పీఎస్ నాయకులు భారీగా బయల్దేరి మందక్రిష్ణకు అభినందనాలు తెలిపి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఆర్ పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇంచార్జి మైలారం బాలు, మండల అధ్యక్షుడు మైలారం రాము, జంగం గోపి, సంకెపల్లి విప్లవ్, బబ్లు పాల్గొన్నారు.

లాలన వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

ఆర్మూర్‌రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ లాలన వృద్దాశ్రమం, ప్రొద్దుటూరి సదానంద్ రెడ్డి వృద్ధాశ్రమంలో శనివారం దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. లాలన ఆశ్రమంలో 33 మందికి సదానంద్‌రెడ్డి ఆశ్రమంలో 40 మంది వృద్దులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారిణి డాక్టర్ ఆయేషా తెలిపారు. అదే విధంగా ప్రతీరోజు చిన్నపాటి వ్యాయమం, యోగాసనాలు చేయాలని వృద్ధు లకు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ వల్లి, ఆరోగ్య కార్యకర్తలు రాజ్యలక్ష్మీ, రేఖ, జయలక్ష్మీ, విజయ, వృద్దులు పాల్గొన్నారు.

వెల్కటూర్‌లో ఘనంగా పెద్దమ్మ తల్లి ఉత్సవాలు

మెండోర, మే31(ఆంధ్రజ్యోతి): మండలంలో వెల్కటూర్ గ్రామలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లికి బోనాలతో గ్రామ వీధుల గుండా మంగళహారతులతో డప్పు సప్పుల్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని పెద్దమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకొని నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన సత్రం ఏర్పాటు చేశారు.

పేదల పక్షాన పోరాడే పార్టీ సీపీఐ

కోటగిరి,మే31(ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన నిలబడి పోరాటాలు చేసే ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని సుద్దులం గ్రామంలో శనివారం సీపీఐ పార్టీ మహసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షన భూపోరాటాలు చేసి వందల ఎకరాలు పేదలకు భూపంపిణీ చేసిన చరిత్ర సీపీఐ పార్టీకి ఉందన్నారు.

భూభారతి మూడో విడత రెవెన్యూ సదస్సులు

మోర్తాడ్ , మే31(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 3 నుండి 13 వరకు భూభారతి మూడవ విడత రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ పీహెచ్ కృష్ణ తెలిపారు. 3న వడ్యాట్, 4న దోన్‌పాల్, 5న సుంకెట్, 6న తిమ్మాపూర్, 9న పాలెం, 10న శెట్‌పల్లి, 11న ధర్మోరా, 12న దొన్కల్, 13న మోర్తాడ్ గ్రామాలలో జరుగుతాయని వివరించారు. ఈ సదస్సులు గ్రామాలలోని గ్రామ పంచాయతీ, పాఠశాలల ఆవరణలో జరుగుతాయని వివరించారు. ఈకార్యక్రమంలో రైతులు, భూమికి సంబంధించిన సమస్యల పరిష్కారం కొరకు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ కోరారు. ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన భూభారతి సదస్సులను రైతులు సద్వినియోగపర్చుకొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా ఈశ్వర్‌సింగ్ మహరాజ్ ఆలయ వార్షికోత్సవం

డిచ్‌పల్లి,మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిపల్లి తండాలో ఈశ్వర్‌సింగ్ మహరాజ్ ఆలయ 36వ వార్షికోత్సవ ఆలయ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మహారాష్ట్రలోని పర్బాని జిల్లా జింతూర్ తాలూక అమర్‌ఘట్ పీఠాధిపతి ఈశ్వర్‌సింగ్ మహరాజ్ మునిమనవడు జానేశ్వర్(మౌళి) మహరాజ్ హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బంజార సోదరులు భక్తి మార్గంలో నడవాలని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున బంజార కుటుంబాలు , భక్తులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

నందిపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖుద్వాన్‌పూర్, శాపూర్ గ్రామాలలో శనివారం బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, ఆర్మూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భైండ్ల ప్రశాంత్ అందజేశారు. అనారోగ్యంతో బాధపడిన బాధిత కుటుంబాలకు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సోసైటీ డైరెక్టర్ తోట మహేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుండు హరీష్, పంచాయతీ కార్యదర్శి కండెల నరేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మంగ్లారం తుక్కన్న, తబ్రేష్, పెర్క ఏర్రక్క, మాజీ ఉప సర్పంచ్ చిరంజీవి శ్రీకాంత్, నవీన్ తదితరులు ఉన్నారు

మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి):2025 విద్యాసంవత్సరానికి స్ప్రింగ్ సీజన్‌కు గాను మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే మైనార్టీ విద్యార్థులకు సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో 60 శాతం మార్కులు ఉండి పోస్టు గ్రాడ్యుయేషన్ చేసేందుకు, పీజీలో 60 శాతం మార్కులు వచ్చి పీహెచ్‌డీ చేయాలనుకునే వారు మాత్రమే అర్హులని ఈనెల 30లోగా ఎంపిక చేయబడిన విదేశీ యూనివర్సిటీలలో అడ్మిషన్లు పొంది ఉన్నవారే అర్హులన్నారు.

ఘనంగా అహల్యబాయి జయంతి

రెంజల్, మే 31(ఆంధ్రజ్యోతి): లోకమాత అహల్యబాయి జన్మదిన వేడుకలను శనివారం కందకుర్తి త్రివేణి సంగమం నందు ఘనంగా నిర్వహించారు. సామాజిక సామరస్య ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అహల్యబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సామాజిక సామరస్య జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీను నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి సృజన్ కుమార్ రెడ్డి, డాక్టర్ అరవింద్, రమేష్, గజానన్, హరిదాస్ పాల్గొన్నారు.

బోధన్‌లో మైనార్టీల ర్యాలీ

బోధన్‌రూరల్,మే31(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టం సవరణపై బోధన్ మైనారిటీలు శనివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలతో అంబేద్కర్ చౌరస్తాలో హక్కుల కోసం స్పష్టమైన సందేశం అందించారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టం-2025కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించామన్నారు.

శాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

నందిపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాపూర్ గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మండల పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ భూమిపూజ చేశారు. ఆర్మూర్ నియోజక వర్గం ఇన్‌చార్జీ పొద్దుటూరి వినయ్ రెడ్డి ఆదేశాల మేరకు పలువురు లబ్దిదారుల ఇళ్లకు ముగ్గుపోశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిషాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డికి లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంతోష్, వంశీ, లక్ష్మణ్, భోజన్న, రజినీకాంత్ తదితరులు ఉన్నారు.

తొర్లికొండలో ఘనంగా వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి , మే31(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. భక్తులు, గ్రామస్థులు కలిసి స్వామివారి పల్లకిని కొండపై చుట్టు ప్రదక్షణ చేయించారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ సంజీవ్‌గౌడ్, ఆలయ కమిటి సభ్యులు, విడిసి సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

ఇందల్వాయి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన అంకం రాజమణి స్పైనల్ స్టెనోసిస్ సమస్య వల్ల హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరడంతో వైద్యానికి అయ్యే ఖర్చులు వారి వద్ద లేకపోవడంతో కుటుంబీకులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిశారు. వైద్యం చేయించుకునేందుకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు 5లక్షల ఎల్‌వోసిని అందజేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానించిన సీపీ

నిజామాబాద్ అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో మే 31న పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులను సీపీ సాయిచైతన్య ఘనంగా సన్మానించారు. పోలీస్ శాఖలో ఎస్సై, సీసీఆర్‌డీగా పనిచేస్తూ 42 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న జి.చాందయ్య, డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న ఎం.సత్యం, మెండోరా పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సాబెర్ హుస్సేన్, మోర్తాడ్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న శ్రీనివాస్‌లు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి జ్ఞాపికలతో సీపీ సన్మానించారు. పోలీస్ శాఖలో ఎంతో పని ఒత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్క్ లేకుండా పదవీ విరమణ చేయడం గొప్ప విషయమని సీపీ అన్నారు. ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పక ఉంటుందని డిపార్ట్‌మెంట్‌కు చేసిన సేవలు ఎంతో గొప్పవన్నారు. ఎలాంటి అవసరం ఉన్నా అన్ని వేళలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు పోలీస్ కమీషనర్ బస్వారెడ్డి, ఏవో ఆసియాబేగం, సతీష్‌కుమార్, మల్లేష్, తిరుపతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'యువత దేశభక్తిని అలవర్చుకోవాలి'

బోధన్‌రూరల్, మే31(ఆంధ్రజ్యోతి): యువత దేశభక్తిని అలవర్చుకోవాలని, దేశ రక్షణ, ధర్మ రక్షణ కోసం మిలటరీలో చేరి దేశ సేవ చేయాలని ఉద్యోగ విరమణ పొందిన సైనికుడు బెల్లంకొండ జయ రాజన్న అన్నారు. శనివారం మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామానికి చెందిన బెల్లంకొండ జయ రాజన్న 47సంవత్సరాలుగా ఆర్మీ జవాన్‌గా దేశానికి సేవ చేశాడని అనంతరం 5సంవత్సరాల పాటు షుగర్స్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ అధికారిగా అనంతరం ఆర్టీసీ కండక్టర్‌గా ప్రజలకు సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందుతున్నారని గ్రామ పెద్దలు సుందర్ రాజు అన్నారు.

పదేళ్లలో సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయలేదు

- మేం వచ్చాక 17,169కోట్ల కేటాయింపు
- గిరిజనుల హక్కులు కాపాడేలా నల్లమల్ల డిక్లరేషన్ ఇచ్చాం: భట్టి విక్రమార్క
- గిరిజనుల హక్కులను రక్షించాలి: మీనాక్షి

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ సర్కారు గిరిజనుల కోసం సబ్‌ప్లాన్ నిధులను ఏ మాత్రం ఖర్చు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.17,169కోట్లను కేటాయించామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసానిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కాంగ్రెస్ తెలంగాణ ఆదివాసీ కార్యకర్తల సమ్మేళనం ముగింపు సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో సబ్‌ప్లాన్ నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తున్నామని చెప్పారు. గిరిజనుల అవసరాలేంటో తెలుసుకునేందుకు ఆ వర్గాలకు చెందిన నాయకులను ఒకచోట చేర్చి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. అడవి బిడ్డలు ఆత్మగౌరవంతో జీవించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా సౌర జల గిరిజన వికాస పథకం తీసుకొచ్చిందని వెల్లడించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు నల్లమల్ల డిక్లరేషన్ తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నాటరాజన్ మాట్లాడుతూ.. గిరిజనుల చట్టాలను, హక్కులను పరిరక్షించి వారిని అన్నిరంగాల్లో ముందు వరుసలో నిలపాలన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులన్నీ పరిరక్షించినప్పుడే వారు అభివృద్ధిలో ముందుకు వెళ్తారని, దీనికోసం కాంగ్రెస్ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. పోడు భూముల్లో సాగు చేసుకుని జీవనం సాగించేందుకు అడవి బిడ్డలకు ఆర్థికంగా చేయూతనందించాలనిసూచించారు. పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం రూ.కోట్లాది నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నాడు ఇందిరాగాంధీ నుంచి ఇప్పటి సోనియాగాంధీ వరకు గిరిజనుల అభివృద్ధికోసం,వారిని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తామని తెలిపారు.


పాల్వంచలో ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడుతున్న భట్టి

రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు.

ప్రభుత్వ పనితీరుపై మీనాక్షి ఆరా

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మీనాక్షి నటరాజన్ శనివారం పాల్వంచలోని జెన్కో అతిథిగృహంలో అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ ఒక్కో ఎమ్మెల్యేతో వేర్వేరుగా మాట్లాడి.. వారి నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో ఆయా ఎమ్మెల్యేలు ప్రభుత్వ పని తీరు బాగానే ఉందని, రుణమాఫీ, రైతు బంధు పథకం అందరికీ అందలేదన్న వ్యతిరేకత కొంత ఉందని ఆమె వివరించినట్టు తెలిసింది.

కొందరు బీజేపీ సీనియర్లతో కేసీఆర్‌కు సంబంధాలు



- ఆ కారణంగానే పార్టీ అధ్యక్ష పదవి నుంచి బండిని తప్పించారు
- గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పిన వారే బీజేపీ అభ్యర్థులు: మహేశ్ గౌడ్

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని, కొందరు బీజేపీ సీనియర్ నాయకులతో కేసీఆర్‌కు సంబంధాలున్నాయని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆ సంబంధాల కారణంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తొలగించారన్నారు. రేపో.. మాపో.. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసాని గురుకుల పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదివాసీ గిరిజన కాంగ్రెస్ సమ్మేళనం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మహేశ్ గౌడ్ మాట్లాడారు. 'బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పినట్టే గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పినట్టుగానే బీజేపీ తమ అభ్యర్థులను నిలబెట్టింది. బీజేపీకి తెలంగాణలో పునాదులు లేవు.. ఆ పార్టీ ఇక్కడ అధికారంలోకి రావడం కలే.. రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉంది. అన్ని వర్గాల ప్రజలకు చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పార్టీ బలోపేతమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వల్ల.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తప్పనిసరిగా కాంగ్రెస్ 90 సీట్లు గెలుచుకుంటుంది' అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్.. ఒక్కటేనని బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదని కొట్టిపారేశారు. బండి సంజయ్ మాటలను ప్రజలు నమ్మడం లేదని, ఆయన ఇంకా యువ మోర్చా నాయకుడిలా మాట్లాడటం సరికాదన్నారు.

అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధే లక్ష్యం: కేటీఆర్

హైదరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధి చెందాలన్నదే తమ అభిమతమని, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌లోని వార్విక్ యూనివర్సిటీలో ప్రాగ్మటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ (పీడీఎస్ఎల్) నాలెడ్జ్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దిగ్గజ కార్పొరేట్ సంస్థలకు తెలంగాణ బిడ్డలు సేవలందించడం గర్వకారణం అన్నారు. పెట్టుబడులు వచ్చి తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు దొరకాలని, అందుకోసం సర్వశక్తులు ఉపయోగిస్తామని చెప్పారు.

కేసీఆర్‌కు నోటీసులంటే.. తెలంగాణకు ఇచ్చినట్లే

ఆయనపై ఈగ వాలినా ఊరుకోం.. కాళేశ్వరం కమిషన్ నోటీసులకు వ్యతిరేకంగా 4న ఇందిరాపార్క్ వద్ద ధర్నా

- జాగృతి నూతన కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. తెలంగాణ జాతిపిత అని, ఆయనకు నోటీసులు ఇవ్వడమంటే యావత్తు తెలంగాణకు నోటీసులిచ్చినట్లేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్‌పై ఈగ వాలినా తాము ఊరుకోబోమని హెచ్చరించారు. కేసీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ ఒక కన్ను అయితే.. తెలంగాణ జాగృతి మరో కన్ను అని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 4న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. శనివారం బంజారాహిల్స్‌లోని తన నివాసం సమీపంలో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని కవిత ప్రారంభించారు. కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించిన అనంతరం బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోదావరి జలాల్లో 200 టీఎంసీల హక్కు తెలంగాణకు ఉండాలని కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని తెలిపారు. "కాళేశ్వరం ద్వారా ఏటా 20 లక్షల ఎకరాలకు నీళ్లు అందించినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా? కోటి ఎకరాల మాగాణంగా తెలంగాణను చేసిందుకు నోటీసులు ఇచ్చారా ? రైతు బీమా, రైతు బంధు పథకాలను ప్రవేశపెట్టినందుకు ఇచ్చారా? తెలంగాణ ప్రజలకు మేలు చేసినందుకు ఇచ్చారా? అది కాళేశ్వరం కమిషనా? లేక కాంగ్రెస్ కమిషనా?"అని కవిత ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం పట్ల ప్రతి తెలంగాణ బిడ్డ బాధపడుతున్నారని అన్నారు.

నీళ్లు తరలించుకుపోతుంటే మాట్లాడరేం?

ఏపీ సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ నీళ్లను తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడని పరిస్థితి ఏర్పడిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం అంత బలహీనంగా ఎందుకున్నారని, పక్క రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఎందుకు పనిచేస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు నదుల అనుసంధానాన్ని తుపాకులగూడెం నుంచి చేపట్టేలా ప్రతిపాదించారని, కానీ.. ఆనాడు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకుండా ఇచ్చంపల్లి నుంచి చేపడతామని చెప్పిందని అన్నారు. కానీ, ఇప్పుడు పోలవరం నుంచి 200 టీఎంసీల గోదావరి నీళ్లను తరలించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. జూన్ 2 నాడు సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కనీసం జై తెలంగాణ అనకపోవడం మన ఖర్మ అని, తెలంగాణ గ్రహచారం బాగాలేక రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని కవిత వ్యాఖ్యానించారు. జై తెలంగాణ అనని వారికి, అమరవీరులకు నివాళులర్పించని వారికి సీఎం కుర్చీలో కూర్చొనే అర్హత లేదన్నారు. ఇప్పటికైనా రేవంత్ జై తెలంగాణ అనాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పిడికిలెత్తి బయటికి వస్తేనే తెలంగాణ వచ్చిందని, దానివల్లే ఇవాళ అధికారంలో ఉన్నామన్న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఆ విషయాన్ని మరిచిపోయి కేసీఆర్‌కు నోటీసులివ్వడం దారుణమన్నారు. యువతకు స్వయం ఉపాధి కోసం ప్రారంభిస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం పేరు మార్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు ఎటువంటి సంబంధంలేని రాజీవ్‌గాంధీ పేరు పెట్టడం సరికాదన్నారు. అమరులు శ్రీకాంతచారి, యాదిరెడ్డి, ప్రజాకవి కాళోజీ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టాలని సూచించారు. రాష్ట్ర శాసనసభ, శాసన మండలి ఆమోదించిన బీసీ బిల్లులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆమోదించకుండా తాత్సారం చేస్తోందని కవత మండిపడ్డారు. ఇటీవల ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి కలిసిన సమయంలో ప్రాజెక్టుల గురించి మాట్లాడారు తప్ప.. బీసీ బిల్లు మీద మాట్లాడలేదని ఆరోపించారు. బీసీ బిల్లును డీప్ ఫ్రిడ్జ్‌లో పెట్టే ప్రయత్నం చేస్తే బీజేపీకి సెగ తాకేలా పోరాటం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే వరకు జాగృతి పోరాటం చేస్తుందని అన్నారు.


జాగృతి కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు చేస్తున్న కవిత

జాగృతి కమిటీల ఏర్పాటు..

మైనారిటీల హక్కుల కోసం కూడా జాగృతి పోరాటం చేస్తుందని కవిత ప్రకటించారు. జాగృతిలో మైనారిటీల హక్కుల కోసం ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ విభాగాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాగృతి తరఫున ఎస్సీ, ఎస్టీ విభాగాన్ని ఏర్పాటు చేసి ఆ వర్గాల కోసం ఉద్యమిస్తామన్నారు. అయితే, తాము పోరాటాలు చేస్తుంటే కొంతమంది ఓర్వడం లేదన్నారు. తెలంగాణ కోసం బీజేపీ నాయకులు మాట్లాడకపోవడం దారుణమని, 8మంది ఎంపీలను గెలిపించినా కేంద్రం నుంచి రూపాయి తీసుకురాలేదని విమర్శించారు. గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను కాపాడకపోతే తెలంగాణ జాగృతి పవర్ చూపిస్తామన్నారు. కాగా, తెలంగాణ జాగృతి కార్యాలయ కార్యదర్శిగా పొన్నమనేని బాలాజీరావును నియమిస్తున్నట్లు ఆ కార్యాలయం తెలిపింది.

బీజేపీతో పొత్తు ఉంటుందని ఏమార్చారు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లోకి.. వచ్చినప్పుడల్లా కేసీఆర్ ఇదే చెప్పారు: సంజయ్



కరీంనగర్, మే 31(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీలోని చాలా మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లోకి వచ్చారని.. అలా జరిగిన ప్రతిసారీ కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశమై కమలంతో పొత్తు పెట్టుకుంటామని చెప్పి వారిని కాషాయ గూటికి రాకుండా చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ అంటేనే అవినీతి పార్టీ అని, కవితను అరెస్టు చేయకుండా ఉండటానికి బీజేపీతో కలవడానికి బీఆర్ఎస్ ప్రయత్నించిందని చెప్పారు. కుటుంబ పార్టీని తాము దగ్గరకు రానివ్వలేదని తెలిపారు. శనివారం కరీంనగర్‌లో సంజయ్ విలేకరులతో మాట్లాడారు. ఈటల రాజేందర్, హరీశ్‌రావు భేటీ విషయం తెలియదని, ఇదంతా కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా అని తెలిపారు. కవిత విషయంలోనూ అదే డ్రామా నడుస్తోందని చెప్పారు కల్వకుంట్ల ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నిర్మాణ దర్శకత్వంలో కవిత పాత్రధారిగా చార్‌పత్తా సినిమా నడుస్తోందన్నారు. కవిత ఎపిసోడ్‌తో ప్రజలకు మేలు జరుగుతుందా..? అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలపై చర్చ జరగకుండా చిట్‌చాట్‌ల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర జరుగుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ముమ్మాటికీ దేశద్రోహమే అని సంజయ్ అన్నారు. సైన్యం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా, పాకిస్థాన్ ఉగ్రవాదులను పెంచి పోషించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి, కాళేశ్వరం ప్రాజెక్టు, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, ఫాంహౌస్, ఫార్ములా-ఈ రేసు కేసుల విషయంలో అరెస్టులు ఉంటాయని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని చూస్తున్నాయని, వాళ్లెన్ని కుట్రలు చేసినా అది జరగదని చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయ పరిధిలో 18 గోవులు చనిపోవడంపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని సంజయ్ అన్నారు.

ఖరీఫ్ సాగులో నిమగ్నమైన రైతులు

● ఈ సారి కూడా పసుపు సాగుపై రైతుల దృష్టి ● పుష్కలంగా వర్షాలు కురిసి పంటలు పండాలని వరుణదేవుడిని వేడుకుంటున్నరైతులు


విత్తనాలు పెటేందుకు ట్రాక్టర్‌తో బోజసాల్లు చేస్తున్న దృశ్యం


మొక్కజొన్న విత్తనాలు పెడుతున్న మహిళ రైతులు


ట్రాక్టర్‌లో ఎరువుల బస్తాలను తీసుకువెళ్తున్న రైతులు

జక్రాన్‌పల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభం కాకముందే మండలంలో అకాల భారీ వర్షాలు కురిసాయి. దీంతో రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం గ్రామాలలో వ్యవసాయ పనుల్లో, అలాగే పసుపు, మొక్కజొన్న, సోయాబీన్ విత్తనాలు విత్తడంలో రైతులు బిజీబిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఈ ఖరీఫ్‌లో 1351 ఎకరాల్లో పసుపు పంటను రైతులు సాగు చేయనున్నారు. అలాగే మొక్కజొన్న పంట 4530 ఎకరాలు, సోయాబీన్ 350 ఎకరాలు, వరిపంటను 13430 ఎకరాల్లో రైతులు సాగు చేయనున్నారు. గత ఏడాది మాదిరిగా ఈ సారి కూడా ఖరీఫ్‌లో రైతులు పసుపు సాగుపై దృష్టి సారించారు. గత ఏడాది 1250 ఎకరాల్లో పసుపు సాగుచేయగా ప్రస్తుతం ఈ ఖరీఫ్‌లో 1350 ఎకరాల్లో రైతులు పసుపును సాగు చేయనున్నారు. గత ఏడాది కంటే ఈ ఖరీఫ్‌లో 100 ఎకరాల్లో పసుపు సాగు పెరగనుంది. వరికూడా గత ఏడాది కంటే ఈ సారి వరి సాగు పెరిగిందని వ్యవసాయాధికారిణి దేవిక తెలిపారు. రైతులు పసుపు, మొక్కజొన్న విత్తనాలు విత్తి డ్రిప్పు పైపులు పరుస్తున్నారు. ఈ డ్రిప్పు పైపుల ద్వారా పంటలకు నీటితడి అందుతుంది. రోహిణి, కార్తీకంటే ముందు బోరుబావుల్లో సాగునీరు ఉన్న రైతులు మొక్కజొన్న విత్తనాలు పెట్టి ఈ పంటను సాగుచేస్తున్నారు. పసుపు సాగులో ఎకరాకు 80వేల రూపాయల వరకు పెట్టుబడి ఖర్చులు పెట్టి పసుపు పంటను సాగుచేయనున్నామని రైతులు తెలిపారు. ఈ సారికూడా పుష్కలంగా వర్షాలు కురిసి చెరువులు నిండి పంటలు పండాలని వరుణ దేవుడిని రైతులు వేడుకుంటున్నారు.

పంటలకు మద్దతు ధర కల్పించాలి..
జే. గంగముత్యం, రైతు, జక్రాన్‌పల్లి



రైతులు పండించిన పంటలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధర ప్రకటించి పంటలను కొనుగోలు చేయాలి. పసుపు, మొక్కజొన్న, వరి, సోయాబీన్ ఇతర పంటలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధర కల్పించి పంటలను కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం పసుపు, మొక్కజొన్న, వరి, సోయాబీన్ పంటలకు మద్దతు ధర ప్రకటించింది. ఆ పంటలకు మద్దతు ధర రైతులకు గిట్టుబాటు కాదు. ఎరువులు, విత్తనాల ధరలు పెరిగాయి. వీటి ధరను తగ్గించాలి.

పంట సాగు భూముల దుక్కులు పూర్తిగా తడిసిన తర్వాత విత్తనాలు విత్తుకోవాలి..
- దేవిక, వ్యవసాయాధికారిణి, జక్రాన్‌పల్లి



మండలంలో కురిసిన అకాల భారీ వర్షాలకు పంటసాగు భూముల దుక్కులు పూర్తిగా తడవలేదు. పంటసాగు భూములు పూర్తిగా తడిసిన తర్వాతనే విత్తనాలు విత్తుకోవాలి. ఈ ఖరీఫ్‌లో పంటల సాగుపై రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహిస్తున్నాం. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చిన సలహాలు పాటిస్తే రైతులు పంట దిగుబడులు సాధించవచ్చు.

'డబుల్' నిర్మాణాలకు ట్రబుల్

● అర్ధాంతరంగా నిలిచిన డబుల్ ఇళ్ల నిర్మాణాలు
● రైతునగర్‌లో లబ్ధిదారుల ఎదురు చూపులు


రైతునగర్‌లో నిలిచిన డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణాలు

బీర్కూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం డబుల్ రూంల పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో భాగంగా బాన్సువాడ నియోజక వర్గానికి వేలాది డబుల్ బెడ్ రూంలు మంజూరు అయ్యాయి. పేదలకు వేలాది ఇళ్లను నిర్మించి ఇచ్చారు. ఇంత వరకు బాగానే జరిగింది. కాని అంతలోనే ఎన్నికలు రావడం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరడంతో డబుల్ బెడ్ రూం ఇళ్ల బిల్లులు నిలిచి పోయాయి. దీంతో లబ్ధిదారుల పరిస్థితి గందర గోళంగా మారింది.

నిధులు విడుదల కాక నిలిచిన ఇళ్ల నిర్మాణాలు

2023లో బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామానికి 24 డబుల్ రూమ్ ఇళ్లు మంజూరు అయ్యాయి. డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించడానికి గ్రామంలోని వాటర్ ట్యాంకు వద్ద ఎకరం మేరా స్థలాన్ని కేటాయించారు. 2023 జూన్‌లో ఇళ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. ఇందులో 12 ఇళ్ళకు స్లాబ్‌లు వేశారు. మిగిలిన 12 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. పిల్లర్లు వేసి వదిలేశారు. బిల్లులు మంజూరు కాకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. దీంతో లబ్ధిదారుల సొంతింటి కలలకు బ్రేక్ పడినట్లయింది. రైతునగర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం 48 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయితే తమ సొంతింటి కల నెరవేరుతుందని భావించారు. కాని బిల్లులు మంజూరు కాక వారి ఆశలు అవిరయ్యాయి. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. బిల్లులు మంజూరు చేయించి ఇళ్ల పనులు పూర్తి చేయించి లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు స్థానిక నాయకులు తెలిపారు.

ముందుకు సాగుదామా..వద్దా!

● ఖరీఫ్ సాగుకు అయోమయంలో రైతన్నలు ● ముందే కురిసిన వర్షాలు ● మూడు రోజుల నుంచి ఎండలు

పెద్దకొడప్‌గల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రోహిణి కార్తెలో విపరీతమైన ఎండలు ఉండి రోహిణిలో రోకళ్లు పగులుతాయని సామెత ఉండగా అందుకు విరుద్ధంగా రోహిణి కార్తె చల్లగా ఉంది. నిర్ణీత సమయానికంటే పక్షం రోజుల ముందుగానే అకాల వర్షాలు కురియడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మే నెలలో గత సంవత్సరం సుమారుగా 47 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సారి మాత్రం సుమారుగా 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాలేదు. అంతే గాకుండ గత కొద్ది సంవత్సరాలుగా ఎన్నడూ లేని విధంగా మే చివరి నెలలోనే గట్టిగా వర్షాలు కురియడంతో వాతావరణం చల్లబడింది. వానలకు భూమి నానడంతో పాటు కొన్ని చెరువులలో కొత్తగా నీరు కూడా వచ్చి చేరింది. ఈ వర్షాలకు ఖరీఫ్ పంట సాగుకు ఆశించిన విధంగా దుక్కులు రావడంతో రైతన్నలు దుక్కులు దున్ని పంట సాగుకు సిద్ధమవుతున్నారు.

పంట సాగు చేయాలా వద్దా అన్న సంశయంలో రైతులు

ప్రతీ సంవత్సరం జిల్లా రైతన్నలు ఖరీఫ్ పంట సాగును మృగశిర కార్తె ప్రారంభం అయిన నాటి నుండి ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే పంట సాగు చేసేవారు. అయితే ఈ సంవత్సరం మే చివరి వారంలోనే వారం రోజుల పాటు ప్రతి రోజు ఎంతో కొంత వర్షం కురియడంతో ముందస్తుగానే పంట సాగు చేయాలనే ఆలోచనలో పడిపోయారు రైతన్నలు. ఇందుకు అనుగుణంగానే దుక్కులు దున్నడం, పంట చేనులో వ్యర్థాలు ఏరివేయడం, వ్యర్థాలను కాల్చివేయడం లాంటి పనులను చేశారు. దీంతో పాటుగానే జుక్కల్ నియోజక వర్గంలో నల్ల రేగడి భూములలో ఆరుతడి పంట కింద సోయా, పత్తిలాంటి పంటలను సాగు చేసేందుకు గాను విత్తనాల ను తెచ్చిపెట్టుకున్నారు. పంట సాగుకు అవసరమైన వర్షం కురిసి నందున విత్తనాలు వేసేందుకు సిద్ధపడుతున్నారు. అయితే గత మూడు రోజుల నుండి తిరిగి వాతావరణంలో మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరిగి ఎండకాయడంతో విత్తనాలు వేసేందుకు వెనుకాడుతున్నారు. వ్యవసాయాధికారుల అంచనా ప్రకారం జిల్లాలో ఈ సారి అన్ని పంటలు కలిపి సుమారుగా 5 లక్షల 15 వేల 677 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు అంచనావేశారు. పంట సాగు చేసిన తర్వాత వర్షాలు పడకపోతే ఎలా అన్న సంశయంలో పడుతున్నారు రైతన్నలు. పూర్తి స్థాయిలో వర్షాలు కురిసిన తర్వాత పంటను సాగు చేద్దామా లేదా ధైర్యంతో ఇప్పుడే పంట సాగు చేద్దామా అని ఆలోచించుకుంటున్నారు.


పంట చేనులో దుక్కి సిద్ధం చేసుకుంటున్న రైతన్న

అధ్వానంగా బీఈడీ కళాశాలల తీరు!

● కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు ● రాజకీయ ఒత్తిళ్లతో కళాశాలలపై చర్యలకు వెనకాడుతున్న వర్సిటీ అధికారులు

డిచ్‌పల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని బీఈడీ కళాశాలల్లో వసతులపై ఎన్‌సీఈటీ నిబంధనలకు మేరకు ప్రతీ ఏడాది జరగాల్సిన తనిఖీలు ప్రతీసారి నామ మాత్రంగానే జరుగుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలు నడుస్తున్న వాటిపై చర్యలు తీసుకునేందుకు వర్సిటీ అధికారులు ముందుకు వెళ్లడం లేదు. ఇందుకు నిదర్శనం గత 2023-24 విద్యా సంవత్సరంలో జరిగిన తనిఖీల్లో బీఈడీ కళాశాలలు నిబంధనలకు అనుగుణంగా వసతులు లేకపోవడంతో వర్సిటీ ఆడిట్ సెల్ అధికారులు గుర్తించి ఆ కళాశాలల యాజమన్యాలకునోటీసులు సైతం ఇచ్చారు. కానీ ఇంతవరకు ఆ నోటీసులకు ఎటువంటి ప్రతిఫలం లేకుండా పోయింది. నోటీసులు ఇచ్చిన ఆ కళాశాలలు మాత్రం తీరును మార్చుకోలేదు. ఎన్ సీఈటీ నిబంధనలు మేరకు ఉండాల్సిన ఎటువంటి వసతులు విద్యార్థులకు కల్పించడం లేదు. దీంతో విద్యార్థులకు వసతులు అందడం లేదు. మౌలిక సదుపాయాలు లేక, కళాశాల ఆవరణలో ఆటల కోసం క్రీడా మైదానం, తరగతి గదులు, ప్రాక్టికల్ కోసం ప్రత్యేక ల్యాబ్‌లు ఉండాలి. కానీ అటువంటివి కొన్ని కళాశాలల్లో చూద్దాం అన్న మట్టుకు కనబడటం లేదు. మరికొన్ని కళాశాలల్లో విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూళ్లు చేస్తూ విద్యార్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు మేరకు విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించడంలో జాప్యం జరుగుతుండటంతో కొన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులనుంచే ముందుగానే ఫీజు రీయింబర్స్ మెంట్‌ను వసూళ్లు చేస్తున్నారు. ల్యాబ్ ఫీజులు, కళాశాలల డెవలప్‌మెంట్ ఫీజులు, రికార్డు ఫీజులు పేరుతో లక్షల రూపాయలు వసూళ్లు చేస్తున్నారు. ఈ విషయాలపై తెలంగాణ యూనివర్సిటీ అధికారులకు తెలిసిన మిన్నుకుండి పోతున్నారనే అపవాదు వినబడుతుంది. అధిక ఫీజుల వసూళ్ల చేస్తున్నరనే ఆరోపణలతో ఆర్మూర్‌లోని ఒక బీఈడీ ప్రైవేట్ కళాశాలపై గతంలో రిజిస్ట్రార్ యాదగిరికి విద్యార్థి సంఘం నాయకులు సైతం వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి లక్షల రూపాయల్లో అక్రమంగా ఫీజులు వసూళ్లు చేస్తున్న వర్సిటీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. తనిఖీల విషయంలో ప్రతి ఏడాది కొన్ని కళాశాలలు న్యాయస్థానాల ద్వారా తాత్కాలికంగా లబ్ధిపొందుతూ నిబంధనలకు విరుద్ధంగా కళాశాలల ను నడు పుతున్నారు. తనిఖీల్లో వాస్తవాలు బయటబడ్డ వాటిని చూడనట్లు వర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శ ఉంది. ఎందుకంటే ఆ ప్రైవేట్ కళాశాలలు కొందరు రాజకీయ నేతలతో వర్సిటీ అధికారులపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారనే గుసగుసలు వినబడుతున్నాయి.


టీయూ కళాశాల

ఎస్‌ఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా


అటానమస్ లోగోను ఆవిష్కరిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ మారయ్యగౌడ్

నిజామాబాద్ అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖలీల్‌వాడి లోగల ఎస్‌ఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలకు 2025-26 విద్యాసంవత్సరం నుంచి నూతనంగా యూనివర్సిటీ గ్రాండ్స్ కమీషన్ (యూజీసీ) న్యూఢిల్లీ వారు స్వయం ప్రతిపత్తి హోదాను కల్పించారు. ఈ గుర్తింపు ద్వారా కళాశాలలో విద్యాప్రాముఖ్యత, సృజనాత్మకత, సమగ్ర విద్యా అభివృద్ధి దిశగా ఒక కీలక మార్పు జరిగింది. అటానమస్ హోదా వల్ల కళాశాలకు సొంత పాఠ్యప్రణాళికతో పాటు కొత్త కోర్సులు, ఆధునిక విద్య అవసరాలు, పరిశ్రమల అవసరాలను ప్రతిబింబించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడం, స్వయంగా కళాశాల పరీక్షల నిర్వాహణ, మూల్యాంకన విధానాలను స్వేచ్ఛగా అమలు చేసే అవకాశం లభిస్తుందని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మారయ్యగౌడ్ అన్నారు. ఈ మేరకు శనివారం కళాశాలలో విద్యాసంస్థల సీఈవో హరితగౌడ్, డైరెక్టర్ హర్షిత్‌గౌడ్‌ల చేతుల మీదుగా అటానమస్ హోదా లోగోను ఆవిష్కరించారు. అనంతరం మారయ్యగౌడ్ మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తి హోదా లభించడం ఆనందంగా ఉందని గత 33 సంవత్సరాలుగా జిల్లాలో విద్యా వ్యవస్థలో తాము చేస్తున్న నిరంతర కృషికి లభించిన గౌరవ సూచకమే కాక భవిష్యత్తుకు సంబంధించిన బాధ్యతను పెంచిందన్నారు.ఇటీవలే న్యాక్ గుర్తింపు సైతం ఎస్‌ఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలకు వచ్చిందని ఆయన అన్నారు. ఈసందర్భంగా తనకుమారుడు హర్షిత్ గౌడ్‌ను విద్యా సంస్థల డైరెక్టర్‌గా ప్రకటించారు. తెలంగాణ యూనివర్సిటీ వైస్‌చాన్సిలర్, రిజిస్ట్రార్‌లకు, కళాశాల అధ్యాపకులకు,విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే స్టేషన్ ప్రాంతంలో పర్యావరణంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రైల్వే సిబ్బంది

సుభాష్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే కాలనీలో అవగాహన సదస్సును నిర్వహించారు. శనివారం రైల్వే సీనియర్ వైద్యాధికారి డాక్టర్ వినయ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ సుస్థిర జీవన విధానంపై కాలనీవాసులకు అవగాహన నిర్వహించారు. అనంతరం రైల్వే కాలనీ వాసుల అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌సాగర్, రైల్వే స్టేషన్ మేనేజర్ సదాశివుడు, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రెవెన్యూ ఉద్యోగుల రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

నిజామాబాద్ అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో హెల్పింగ్ హార్ట్ ఫౌండేషన్ తరపున రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ప్రారంభించగా రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు వివిధ శాఖలకు చెందిన సుమారు 60 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. తలసేమియా పేషెంట్ల కోసం రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. అన్ని దానాలలో కెల్లా రక్తదానం ఎంతో గొప్పదని ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజా మాబాద్, ఆర్మూర్ ఆర్‌డీవోలు రాజేందర్‌కుమార్, రాజాగౌడ్, రెవెన్యూ ఉద్యోగులసంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రశాం త్, ప్రభు, మహేష్, శ్రీనివాస్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దాబా,రెస్టారెంట్ హోటళ్లపై దాడులు


హోటల్ యజమానికి నోటీసులు అందజేస్తున్న అటవీ, పోలీస్‌శాఖ అధికారులు

నందిపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దాబా హోటళ్లు, రెస్టారెంట్, ఆర్డర్ మెస్‌లపై శనివారం అటవి, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఫ్రిజ్‌లలో నిల్వఉన్న మాంసాలపై అవగాహన కల్పించారు. అంతే కాకుండా అటవి వన్య ప్రాణులైన కుందేలు, దుప్పి, నెమళ్ల మాంసాలు అందుతున్నారని వాకబు చేశారు. అటవీ వన్యప్రాణుల మాంసాలు వండరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోటళ్ల యజమాను లకు నోటీసులు అందజేశారు. ఏవరైనా వన్యప్రాణులను వేటాడి తెస్తే వండితే 1972 వైల్డ్ లైఫ్ యాక్టు కింద నాన్ బెయిలెబుల్ కేసులు నమోదు చేస్తామని దాబా, ఆర్డర్ మెస్, రెస్టారెంట్ యజమానులను హెచ్చరించారు. ఈ దాడులలో ఎస్‌ఐ చిరంజీవి, అటవీడిప్యూటీ రేంజ్ అధికారులు సుధాకర్, రణవీర్, అశోక్, గణేష్, ఉత్తమ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బిగాలను కలిసిన పద్మశాలి సంఘ నూతన కార్యవర్గం


సంఘ సభ్యులను సన్మానిస్తున్న బిగాల గణేష్‌గుప్త

సుభాష్‌నగర్, మే 31(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తను నూతన పద్మశాలి సంఘం కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని బిగాల స్వగృహంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు పద్మశాలి కుల సంఘ అభివృద్ధికి పాటుపడా లని అన్నారు. మాజీ ఎమ్మెల్యేను కలిసిన వారిలో అధ్యక్షుడు దత్తాద్రి ఉపాధ్యక్షుడు ఎనుగం దుల మురళి, కన్న దుబ్బరాజు, బాగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చౌటి భూమేశ్వర్, కార్యదర్శులు అవదూత రాములు, సుభాష్, సాయిలు, శ్రీనివాస్,గంగరాజు, సత్యపాల్, మహేష్ భాస్కర్, పాల్గొన్నారు.

కలిగోట్‌లో నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయడం అభినందనీయం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి

జక్రాన్‌పల్లి , మే31(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కలిగోట్‌లో జవహర్ నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయించడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని కలిగోట గ్రామంలో ఏర్పాటు చేయనున్న జవహర్ నవోదయ పాఠశాల స్థలాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాన నరేంద్రమోదీ, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ చిత్రపటాలకు బీజేపీ నాయకులతో కలిసి దినేష్ కులచారి పాలాభిషేకం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలిగోట్ గ్రామంలో 30 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 100 కోట్ల రూపాలతో నవోదయ పాఠశాలను కలిగోట్‌లో నిర్మించుకోవడం గ్రామస్థుల కళ నెరవేరిందన్నారు. తాత్కాలికంగా నిజామాబాద్‌లోని నాగరంలో డిగ్రీ కళాశాలలో నవోదయ పాఠశాలను నిర్వహిస్తారన్నారు. కలిగోట్‌లో నవోదయ పాఠశాల సొంత భవనం నిర్మాణం పూర్తి కాగానే అక్కడి నుంచి కలిగోట్‌లో ఈ నవోదయ పాఠశాల కొనసాగుతుందన్నారు. ఈ నవోదయ పాఠశాల మంజూరుతో పాటు జిల్లాలో పసుపు బోర్డును ఎంపీ అర్వింద్ మంజూరు చేయించారని ఈ ఘనత ఎంపీ అర్వింద్‌కే దక్కుతుందన్నారు. తాత్కాలికంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పసుపు బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రూరల్ నియోజకవర్గంలోని గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. జక్రాన్ పల్లిలో ఏయిర్‌పోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం భూములను సిద్ధం చేసి కేంద్రప్రభుత్వానికి అప్పగిస్తే జక్రాన్ పల్లిలో ఏయిర్‌పోర్టు ఏర్పాటు ను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయిస్తుందాన్నరు. ఈ సందర్భంగా ప్రధాన నరేంద్ర మోదీకి, ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ఆయన కృతజ్ఞత లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సంజీవ్‌గౌడ్, కుంట మోహన్, కలిగోట్ బీజేపీ నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాలో నవోదయ పాఠశాల ఏర్పాటు పట్ల హర్షం

బాల్కొండ: నిజామాబాద్, జగిత్యాల జిల్లాలో రెండు జవహర్ నవోదయ విద్యాలయాలు మంజూరు చేయించినందుకు తెలం గాణ, ఆంధ్రప్రదేశ్ నేషనల్ యూత్ ప్రాజెక్ట్, యునైటెడ్ నేషన్స్ ఆఫ్ యూత్ ఆర్గనైజేషన్, దక్షిణ ఆసియా మైత్రి సదస్సు చైర్మన్ ఉట్నూర్ సత్యగౌడ్, సెక్రటరీ జనరల్ బిఆర్ నర్సింగ్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ చొరవతో నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయడం అభినందనీయమని వారు ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభిం చాలని ఎంపీ అర్వింద్ నవోదయ విద్యాలయ సమితి డిప్యూటి కమిషనర్ గోపాలకృష్ణ లేఖరాయగా నిజామాబాద్ నగరంలోని డైట్ కళాశాలలో తరగతులు ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

● శాశ్వత భవన నిర్మాణం కలిగోట్‌లో..

నిజామాబాద్ జిల్లాలో శాశ్వత భవన నిర్మాణానికి జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ శివారులోని సర్వే నెంబర్ 1063(30) ఎకరాల భూమి నవోదయ విద్యాలయ సమితికి అందజేశారు. తాత్కాలిక భవన మరమ్మత్తుల కొరకు తన యొక్క ఎంపీ నిధుల ద్వారా రూ. 20 లక్షలు మంజూరు చేసినందుకు జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారని ఈ సందర్భంగా ప్రజలు ఎంపీ అర్వింద్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

ఫుట్‌పాత్ కబ్జాలను తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించాలి

● గ్యాంగ్ వార్‌లు లేకుండా చూడండి : సీపీతో సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అతి పెద్ద నగరాలలో ఒకటైన నిజామాబాద్ నగర అభివృద్ధికి, సుందరీకరణకు అందరం సమిష్టి కృషితో ముందుకు పోవాలని, నగరంలో ఫుట్‌పాత్ కబ్జాలను తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సీపీ సాయిచైతన్య, నగర కమీషనర్ దిలీప్‌కుమార్ లను కోరారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ కమీషనర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఫుట్‌పాత్ కబ్జాలు, సిగ్నల్ పాయింట్స్, వన్‌వే రోడ్, పార్కింగ్ విషయాలలో కఠిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్, గంజాయి విచ్చల విడిగా సరఫరా అవుతుందని వాటిని నియంత్రించాలన్నారు. నగరంలో గ్యాంగ్‌వార్‌లతో ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా అల్లరి మూకలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. అర్ధరాత్రి వరకు విచ్చలవిడిగా దుకాణాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ కొద్ది రోజులుగా నిర్ణీత సమయంలోపు మూసివేయడంలో విజయం సాధించిన పోలీసులను అభినందించారు. ఈ సమావేశంలో ఏసీపీ రాజావెంకటరెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిజామాబాద్ కల్చరల్: హిందూ దేవాల యాల నిర్మాణానికి మార్గదర్శకురాలిగా భారత వీర వనితగా పేరు ఖ్యాతిగడించిన అహల్యాబాయి హోల్కర్ 300 జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రంలోని గోల్ హనుమాన్ వద్ద ఏర్పాటు చేసిన జన్మదినోత్సవ ర్యాలీకి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై ర్యాలీని ప్రారంభించారు. గోల్‌హనుమాన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అహల్యాబాయి గొప్పత నాన్ని చాటిచెబుతూ నినాదాలు చేశారు. నగర పలు వీధులగుండా సాగిన ర్యాలీ మార్కండేయ దేవాలయం వద్ద ముగిసింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ మాట్లాడుతూ పుట్టిన ప్రతీ బిడ్డ పుట్టుకతో తన పూర్వీకుల ధైర్యసాహసాలను అహల్యాబాయి అందిపుచ్చుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ కల్చరల్: మహిళలను ప్రోత్సహించడంలో భాగంగా మాధవ స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు శిక్షణ తరగతులను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని గంగాస్థాన్ ఫేస్-2లోగల మాధవ స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్, జూట్ బ్యాగుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి గణేష్, కార్యదర్శి గంగనర్సయ్య, లోకభూపతిరెడ్డి, సభ్యులు కమల్ ఇనాని, నగేష్, జుగల్ జాజు, సాయిరెడ్డి, ఆకాష్ మోదాని, సందీప్, నాగేశ్వర్‌రావు, శిక్షకురాలు తులసి, లత, తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు

సిరికొండ మే 31 (ఆంధ్రజ్యోతి): జూన్ 3 నుంచి 16 వరకు మండలంలోని 18 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సిరికొండ తహసీల్దార్ రవీందర్‌రావు రైతులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టం వల్ల రైతులకు అంత మేలు జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. ఈ చట్టం పై గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించడంతో పాటు భూ సమస్యలు ఉంటే సదస్సుల్లో దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన రైతులకు కోరారు. తహసీల్దార్,నాయబ్ తహసీల్దార్‌తో రెండు గ్రూపులను ఏర్పాటు చేసి సదస్సులను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

డిచ్‌పల్లి:రైతుల సాగు భూముల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూభారతి చట్టం ద్వార రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని డిచ్‌పల్లి తహసీల్దార్ సతీశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని 33గ్రామాల్లో ఈ సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు. 3వ తేదిన సుద్దులం, కమలపూర్, 4న సుద్ద పల్లి, బీబీపూర్, 5న మెంట్రాజ్‌పల్లి, మిట్టపల్లి, 6న బర్ధిపూర్, డిచ్‌పల్లి, 9న యానంపల్లి, రాంపూర్, 10ననడిపల్లి, ముల్లంగి, 11న అమృతపూర్, అరెపల్లి, 12నకోరట్‌పల్లి, దూస్‌గాం, 13న ఘన్‌పూర్ గ్రామాలలో ని పంచాయతీ కార్యాలయాల్లో ఈ రెవెన్యూ సదస్సుల నిర్వహణ ఉంటుందన్నారు.

ప్రతిభ ఆసుపత్రిలో వైద్య ఆరోగ్య శాఖ బృందం విచారణ

నిజామాబాద్ అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హైదరాబాద్ రోడ్‌లోగల ప్రతిభ ఆసుపత్రిలో శుక్రవారం మహిళ మృతి చెందిన ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ బృందం విచారణ చేపట్టింది. శనివారం ఆసుపత్రిని సందర్శించిన బృందం మహిళ మృతిపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన సమయంలో మహిళ పరిస్థితి ఏ విధంగా ఉంది సర్జరీ చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది తెలుసుకున్నారు. ఏఏ పరీక్షలు నిర్వహించారు, సర్జరీ సమయంలో ఎలాంటి వైద్యం అందించారో పూర్తి వివరాలను నమోదు చేసుకున్నారు. సర్జరీ చేసిన డాక్టర్ల అర్హత, అనుభవం, గతంలో చేసిన ఆపరేషన్ల వివరాలను తెలుసుకున్నారు. ఈ బృందంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, డాక్టర్ వెంకటేశ్, డీహెచ్‌ఈ వేణుగోపాల్, డీహెచ్‌వో గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

ధూమపానానికి యువత దూరంగా ఉండాలి: డాక్టర్ సుశాంత్‌రెడ్డి

ఇందల్వాయి, మే 31 (ఆంధ్రజ్యోతి): దూమపానం ఆరోగ్యానికి హానికరం అని దూమపానానికి నేటి యువత దూరంగా ఉండాలని డాక్టర్ సుశాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇందల్వాయి వైద్యాధికారి సుశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో దూమపానం వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం ర్యాలీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ భువన, ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, ఆరోగ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ

నిజామాబాద్ అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి):పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నగరంలోని మాలపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దూమపానం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచడం, ఈ వ్యసనాన్ని వదిలేసేందుకు ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సహిస్త ఫిర్దోస్, అజ్మత్ ఉన్నీసాబేగం, భార్గవి, అవంతి, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలి

మోపాల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం బ్యాంకు సీఈవో నాగభూషణంకు వినతిపత్రాన్ని సమర్పించారు. గత కొన్ని సంవత్సరాల నుంచి సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు చాలీ చాలని వేతనాలు ఇస్తున్నారని ప్రభుత్వాలు మారుతున్నా ఉద్యోగుల సమస్యలు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో ఎంఎస్ 44 ప్రకారం డీఎల్‌ఈసీ ఫండ్ ద్వారా జీతాలు లేని అన్ని సంఘాలకు జీతాలు ఇచ్చి బదిలీ చేయాలన్నారు.

ఏకత్మ మానవతవాదం సెమినార్‌కు బోధన్ వాసి

బోధన్‌రూరల్,మే31(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో శనివారం బీజేపీ పార్టీ నిర్వహించిన ఏకత్మ మానవతవాదం జాతీయ సెమినార్‌కు తెలంగాణ రాష్ట్రం నుండి 8మంది ప్రతినిదులు పాల్గొనగా సేమిరాన్‌లో బోధన్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాశ్చాత్య సంస్కృతిని వీడనాడాలి

● హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి
● ఘనంగా బాలాజీ మందిరం 20వ వార్షికోత్సవ వేడుకలు

కోటగిరి,మే31(ఆంధ్రజ్యోతి): పాశ్చాత్య సంస్కృతిని వీడనాడి హిందు సంప్రదాయాలు కొనసాగించాలని శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి పేర్కొన్నారు. పోతంగల్ మండల కేంద్రంలోని బాలాజీ మందిరం 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే గణపతి, గౌరి పూజ, స్వస్తి పుణ్యవహచనం, నవగ్రహ, సర్వతో భద్ర, వాస్తుమండలి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ కార్యక్రమానికి హంపీ పీఠాధిపతి ముఖ్య అతిథిగా హజరైన కల్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రవచనలు చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరు దైవ భక్తిని పెంపొందించుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బచ్చు శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూభారతి రెవెన్యూ సదస్సులను సమర్థవంతంగా నిర్వహించాలి

(ఐదో పేజీ తరువాయి)

నుంచి సదస్సులు ప్రారంభం కావాలని సాయంత్రం వరకు అందుబాటులో ఉంటూ దరఖాస్తులను స్వీకరించాలని ఆయన గడువు విధించారు. నిర్ణీత షెడ్యూల్‌ను అనుసరిస్తూ రెవెన్యూ బృందాలు సకాలంలో గ్రామాలకు చేరి సదస్సుల నిర్వాహణకు సంబంధించిన సమాచారాన్ని రెండు రోజుల ముందుగానే తెలియజేస్తూ ప్రచారం నిర్వహించాలన్నారు. సదస్సులు నిర్వహించే చోట తాగునీరు. టెంట్లు, కుర్చీలు ఉండేలా చూడాలని దరఖాస్తుల స్వీకరణ కోసం కౌంటర్, హెల్ప్‌డెస్క్ అందుబాటులో ఉంచాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా రిజిస్టర్‌లలో సమగ్ర వివరాలను నమోదు చేస్తూ పూర్తి డాటాను కంప్యూటర్ ఆన్‌లైన్‌లో పొందుపర్చా లన్నారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తూ పక్కాగా ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించాలన్నారు. అవకతవకలకు అవకాశం కల్పిస్తే ప్రభుత్వ యంత్రాంగానికి, రెవెన్యూ వ్యవస్థకు చెడ్డ పేరు వస్తుందని ఆయన అన్నారు. కావాలని తప్పిదాలు చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని సస్పెండ్ చేసేందుకు కూడా వెనుకాడబోమన్నారు. సాదాబైనామాలు, పీవోటీ దరఖాస్తులకు సంబంధించి రికార్డుల పరిశీలన, సాధారణ విచారణలు మాత్రమే జరపాలని, హైకోర్టులో స్టే తొలగిన మీదట ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా వాటిని క్రమబద్ధీకరించడం జరుగుతుందన్నారు. ఒకే దరఖాస్తులో ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో భూసమస్యలు పొందుపరిస్తే ప్రతీ సమస్యను తప్పనిసరిగా పరిశీలిస్తూ వేరువేరుగా విచారణ జరపాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్‌డీవోలు, తహశీల్దార్లు, ఆర్‌ఐలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

● ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలి: కలెక్టర్

ఇందిరమ్మపథకం కింద ఇళ్లను నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇసుక, మొరం అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో లబ్ధిదారులను అన్ని విధాల ప్రోత్సహిం చాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా ఇళ్ల నిర్మాణాలకు ముందుకు వచ్చేవారికి సరిపడా ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు ప్రారంభ మైతే వాగులు, నదులలో వరద జలాలు చేరుకొని ఇసుక లభించే పరిస్థితి ఉండదని దీన్ని దృష్టిలో పెట్టుకొని వానలు కురియక ముందే సరిపడా ఇసుక నిల్వలను ఇందిరమ్మ లబ్ధిదారులు ముందస్తుగా సమకూర్చుకునేం దుకు వెసులుబాటు కల్పించాలన్నారు. ఎక్కడ కూడా ఇసుక కొరత కార ణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయన్న ఫిర్యాదులు రాకూ డదని ఆయన సూచించారు.

సీబీఎస్ఈ గుర్తింపు రగడ...

(ఐదో పేజీ తరువాయి)

విద్యార్థులు సన్నద్ధమయ్యే అవకాశం ఉంటుందని నమ్మే తల్లిదండ్రుల నమ్మకాన్ని సొమ్ము చేసుకోవడానికి కొన్ని పాఠశాలలు తమకు సీబీఎస్ఈ అనుమతులు వచ్చాయంటూ లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు. జిల్లాలో కేంద్రీయ విద్యాలయాలతో పాటు ఇటీవల నవోదయ పాఠశాల కూడా మంజూరు కాగా సీబీఎస్ఈ సిలబస్‌పై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో వస్తున్న ఆధరణను కొంత మంది సొమ్ము చేసుకునేందుకు ఇలాంటి ప్రచారాలు నిర్వహిస్తు న్నారని విద్యార్థి సంఘాలు సైతం ఆరోపిస్తున్నాయి.

● విద్యాశాఖ అనుమతి తప్పనిసరి...

సీబీఎస్ఈ పాఠశాలగా మార్పు పొందాలంటే మొదటగా స్టేట్ సిలబస్‌తో కూడిన విద్యాశాఖ అనుమతితో పాఠశాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. 8వ తరగతి వరకు స్టేట్ సిలబస్ గానే సీబీఎస్ఈ పాఠశాలలు కొనసాగుతాయి. 9, 10 తరగతులకు మాత్రం ఖచ్చితంగా సీబీఎస్ఈ అనుమతి పొందాల్సి ఉంటుంది. సీబీఎస్ఈ అనుమతి పొందాలంటే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నిబంధనల ప్రకారం క్లాస్‌రూమ్ లతో పాటు టీచింగ్ ఫ్యాకల్టీ, ఇతరత్ర వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచాల్సి ఉంటుంది. సీబీఎస్ఈ అనుమతుల తర్వాతనే సదరు పాఠశాలకు సీబీఎస్ఈ అఫిలియేషన్ నెంబర్ ఇవ్వడం జరుగుతుంది. ఈ విషయమై ఇటీ వల ఏఐఎస్ఎఫ్ నాయకులు పాఠశాల ఏర్పాటు చేస్తున్న భవనం ముందు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా ఏఐఎస్ఏ నాయకులు సీబీఎస్ఈ పేరుతో నిర్మాణంలో ఉన్న పాఠశాలలపై ఫిర్యాదు చేశారు.

● విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకునేనా...

చిన్న చిన్న కాలనీలలో, గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసే ప్రైవేటు పాఠశాలల విషయంలో కఠినంగా వ్యవహరించే విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ విద్యాసంస్థల విషయంలో చర్యలకు వెనుకాడడం విమర్శలకు తావిస్తుంది. ఇటీవల నగరంలో సీబీఎస్ఈ పేరుతో 400లకు పైగా అడ్మిషన్లు పొందిన కార్పొరేట్ విద్యాసంస్థల విషయంలో విద్యార్థి సంఘాలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి ప్రజావాణిలో కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అడ్మిషన్లు పొందిన తర్వాత ఆ పాఠశాలలకు అనుమతులు రాకుంటే అడ్మిషన్లు పొందిన విద్యార్థుల పరిస్థితి ఏమిటని ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని విద్యార్థి సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో తేలాల్సి ఉంది.

నాయీ బ్రాహ్మణుల వృత్తిని ఇతరులు చేయకుండా చూడాలి

సుభాష్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): నాయి బ్రాహ్మ ణుల వృత్తిపై ముప్పేట దాడి జరుగు తుందని ఇతర కులస్తులు ఈ వృత్తిని చేపట్టి మా పొట్టకొడుతున్నారని నగరనాయిబ్రాహ్మణ దుకాణాల అసోసియేషన్ అధ్యక్షుడు దేశాయి గంగాధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో అత్య వసర సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నాయిబ్రాహ్మణుల కుల వృత్తిని నాశనం చేసే విధంగా ఇతర కులస్తులకు మంగళి షాపులు పెట్టు కునే వి దంగా ప్రోత్సహించిందన్నారు.ఈకార్యక్రమంలో సురేందర్, నాగేష్, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.